సాక్షి విశాఖపట్నం

శనివారం । 25 । మే । 2024



ఆన్‌లైన్‌లో ఇంటర్ మూల్యాంకనం! 8లో



పాలిటెక్నిక్, గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు 8లో



బెంగళూరు-భువనేశ్వర్ మధ్య సమ్మర్ స్పెషల్ 8లో

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- ఎన్నికల ఫలితాలకు సరిగ్గా పది రోజులు
- ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం
- నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ రూమ్స్ కేటాయింపు
- జూన్ 2న స్ట్రాంగ్ రూమ్స్‌కు సర్వీస్, పోస్టల్ బ్యాలెట్లు తరలింపు



ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశమైన జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున

సాక్షి,విశాఖపట్నం: ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పటిష్ట ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కోసం గదులు కేటాయింపును అధికారులు పూర్తి చేశారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ మొదలు కానుంది. ముందుగా చేపట్టే పోస్టల్, సర్వీస్ ఓట్లు లెక్కింపు కోసం ఏయూలోని రూమ్ నం.4ని కేటాయించారు. ఈ ఓట్లను జూన్ 2వ తేదీన స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విశాఖపట్నం జిల్లా, ఎంపీ స్థానంలో అభ్యర్థుల భవితవ్యం తేలే రోజు సమీపిస్తున్న తరుణంలో ఏర్పాట్లలో జిల్లా ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. విశాఖ జిల్లా ఓటర్లు 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి మరింత ఉత్సాహంతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో 20,12,373 మంది ఓటర్లు ఉండగా 14,09,316 (70.03 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా 23,981 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఈ రెండూ కలిపి జిల్లాలో మొత్తం 71.2 శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 19,27,303 మంది ఓటర్లు ఉండగా 13,70,484 (71.11 శాతం) మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 22,454 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మొత్తం 72.3 శాతం పోలింగ్ నమోదైంది.

స్ట్రాంగ్ రూంకు పోస్టల్, సర్వీస్ ఓట్లు

ఉద్యోగులు, ఇతరులు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్లను ఇప్పటికే గుర్తించిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. సర్వీసు ఓటర్ల నుంచి పోస్టల్ ద్వారా వస్తున్న ఓట్లను ఆయా ఆర్వోల పరిధిలో భద్రపరుస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జూన్ 2వ తేదీన అభ్యర్థుల సమక్షంలో ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌లకు ఈ ఓట్లన్నింటివనీ తరలించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున సిద్ధం చేస్తున్నారు. 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు ప్రారంభం కానుంది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ఈఈఈ బ్లాక్ సెమినార్ హాలులో, తొలి అంతస్తు రూమ్ నెం.4లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముందుగా ప్రారంభం కానుంది.

ఏయే స్థానాల లెక్కింపు ఎక్కడంటే..

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ నియోజకవర్గం ఓట్లు ఎక్కడ లెక్కించాలి.. ఆ నియోజవకర్గ పరిధిలో పార్లమెంట్ స్థానానికి చెందిన ఓట్లు ఎక్కడ లెక్కింపు ప్రక్రియ ప్రారంభించాలి.. మొదలైన ఏర్పాట్లను అంశాల వారీగా సిద్ధం చేశారు. ఆ వివరాల్ని ఓసారి పరిశీలిస్తే...

- భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్సులో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రూమ్ నెం.5లో నిర్వహిస్తారు. అక్కడ పోలైన పార్లమెంటు ఓట్ల లెక్కింపు అదే బిల్డింగ్‌లో ఉన్న రూమ్ నెం.7లో జరుగుతుంది.
- తూర్పు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్సులోని మొదటి అంతస్తు రూమ్ నెం.9లోనూ, అక్కడి పార్లమెంటు ఓట్ల లెక్కింపు రూమ్ నెం.10లో నిర్వహిస్తారు.
- దక్షిణ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కంప్యూటర్ సైన్స్ బ్లాక్ లోని ఈ-క్లాస్ రూమ్ లోనూ, పార్లమెంటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ అదే బ్లాక్ లోని కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చరల్ ఎంబైడెడ్ సిస్టం ఐటీ ల్యాబ్‌లోని ఫస్ట్‌ఫ్లోర్ రూమ్ నం.ఎఫ్ఎఫ్-2లో జరగనుంది.
- ఉత్తర నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్సులోని మొదటి అంతస్తు రూమ్ నెం.1లోనూ, పార్లమెంటు ఓట్ల లెక్కింపు అదే బిల్డింగ్ లోని మొదటి అంతస్తు రూమ్ నం.5లో నిర్వహిస్తారు.
- పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇన్స్ంట్రిమెంటేషన్ టెక్నాలజీ ఇంజనీరింగ్ బ్లాక్ సెమినార్ హాలులో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు అదే బ్లాక్ లోని రూమ్ నెం.3లో జరుగుతుంది.
- గాజువాక నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్ లోని గ్రౌండ్ ఫ్లోర్ మొదటి అంతస్తులోని డ్రాయింగ్ హాలులో, పార్లమెంటు ఓట్ల లెక్కింపు మొదటి అంతస్తులోని సెమినార్ హాలులో నిర్వహించనున్నారు.
- శృంగవరపు కోట నియోజకవర్గ పరిధిలో విశాఖ పార్లమెంటుకు పోలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయనగరం జిల్లాలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుంది.

31లోపు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందించాలి

జిల్లా ఎన్నికల అధికారి డా.మల్లికార్జున

కౌంటింగ్ ప్రక్రియ శాంతియుత ప్రక్రియలో, సజావుగా సాగేలా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున కోరారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత, కౌంటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీ చేసిన అభ్యర్థులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డా.మల్లికార్జున మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం తరపున పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ కోసం రాజకీయ పార్టీల నుంచి భాగస్వామ్యం కానున్న కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను ఈ నెల 31వ తేదీ లోగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. 18 ఏళ్లు దాటిన వారిని మాత్రమే రిఫర్ చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, కార్పొరేషన్లు, ఇతర మార్గాల ద్వారా ఆదాయం పొందుతున్న వారు ఏజెంట్లుగా ఉండేందుకు అర్హులు కాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ ఏజెంట్లకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాలని అభ్యర్థులకు సూచించారు.

అధికారికంగా గుర్తింపు పొంది, ఐటీ కార్డులు పొందిన ఏజెంట్లు లెక్కింపు ప్రారంభం కావడానికి గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని డా.మల్లికార్జున చెప్పారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఫలితం 3.15 గంటలకు వచ్చే అవకాశం

ఆలస్యంగా భీమిలి ఫలితం

మహారాణిపేట: జూన్ 4వ తేదీన జరగబోయే ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. పార్లమెంటు నియోజకవర్గం,అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన సిబ్బంది నియామకం,రౌండ్లు వివరాలు,టేబుల్స్ ఏర్పాటు తదితర విషయాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున రిటర్నింగ్ అధికారులతో చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.ఈటీపీఎస్ ఓట్లు(సర్వీసెస్) ఓట్లు లెక్కింపు మొదలవుతుంది.ఆ తర్వాత ఉద్యోగులు వేసిన ఓట్లు లెక్కిస్తారు. ఉదయం 8 గంటలకు ఈవీఎంలను లెక్కింపు మొదలుపెడతారు. జిల్లాలో నాలుగు వేల మంది వరకు పోస్టల్ బ్యాలెట్ ఉండగా, శుక్రవారం నాటికి 891 కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. మొత్తం పోస్టల్ బ్యాలెట్స్,ఉద్యోగుల ఓట్లు లెక్కింపును మూడు రౌండ్లులో పూర్తి చేయవలసి ఉంది.

పశ్చిమదే తొలి ఫలితం

మొదటి ఫలితం విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి వచ్చే అవకాశం ఉంది. పోలైన ఓట్లు ఆధారంగా 16 రౌండ్లు విభజించారు. మధ్యాహ్నం 3.15 గంటలకు ఫలితం వచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత దక్షిణం 17 రౌండ్లకు విభజించారు. ఆ ఫలితం కూడా 3.30 గంటలకు వచ్చే అవకాశం ఉంది. ఆలస్యంగా భీమిలి ఫలితం వెలువడనుంది. ఇక్కడ 26 రౌండ్లు వచ్చాయి. దీని వల్ల రాత్రి 7.30 గంటలకు ఫలితం వస్తుందని అంచనా వేశారు.



ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ మయూర్ అశోక్

న్యూస్‌రీల్

రాజభాషా అమలులో వాల్తేర్ డివిజన్‌కు ప్రథమ స్థానం



వాల్తేర్ డివిజన్ అధికారులతో డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: రాజభాషా అమలు చేసే ప్రధాన కార్యాలయాల జాబితాలో వాల్తేర్ డివిజన్ 2023–24గాను ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. వాల్తేర్ డివిజన్‌కు చెందిన ఆరుగురు అధికారుల కృషి ఫలితంగా ఈ బహుమతిని సొంతం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. టీవోఎల్ఐసీ విశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులకు వివిధ హిందీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్ సౌరబ్‌ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఇంచార్జి సెక్రటరీ టిఓఎల్ఐసీ/ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, టీవోఎల్ఐసీ మెంబర్ కార్యాలయాల ఉన్నతాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

27న వాహనాల బహిరంగ వేలం

మద్రిపాలెం: వివిధ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలను ఈ నెల 27న బహిరంగ వేలం వేస్తున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) గోపాలపట్నం ఎస్ఐ ఉపేంద్ర శుక్రవారం తెలిపారు. ఈ మేరకు మురళీనగర్ ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న గోపాలపట్నం సెబ్ కార్యాలయంలో 27న ఉదయం 11 గంటలకు రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలను (స్క్రాప్ రూపంలో) బహిరంగ వేలం వేస్తున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు సెబ్ విభాగం నిర్ణయించిన ధరావత్తు ధర రూ.2వేలు చెల్లించి ముందుగా టోకెన్ తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు




బీవీకే కళాశాలలో పరీక్షరాసి వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించమని అధికారులు ముందుగానే ప్రకటించటం, అదే విధంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఉదయం 49 కేంద్రాల్లో జరిగిన ఫస్టియర్ పరీక్షకు 8,920 మందిలో 8,515 మంది విద్యార్థులు హాజరయ్యారు. 95 శాతంహాజరు నమోదైంది. అదేవిధంగా మధ్యాహ్నం 10 సెంటర్లలో సెకెండ్ ఇయర్ పరీక్షలు జరుగగా, వీటికి 1,270 మంది విద్యార్థులకుగానూ 1,160 మంది హాజరయ్యారు. 91 శాతంహాజరు నమోదైంది. కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా ఆర్ఐవో పి. మురళీధర్, డీవీఈవో రాధ, జిల్లా ఎగ్జామినేషన్ టీమ్, అదేవిధంగా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆర్ఐవో మురళీధర్ తెలిపారు.

టెన్త్‌కు 846 మంది హాజరు

జిల్లాలో 20 కేంద్రాల్లో శుక్రవారం ఉదయం జరిగిన టెన్త్ పరీక్షలకు 846 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. 533 మందిపరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

కమలానంద భారతి స్వామి ప్రసంగం రేపు



సీతంపేట: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు , భువనేశ్వరి పీఠం అధిపతి కమలానంద భారతి స్వామి ఆదివారం ఉదయం శంకరమఠంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నట్టు నిర్వాహక కమిటీ తెలిపింది. దేవాలయం కేంద్రంగా ధార్మిక, సామాజిక కార్యక్రమ నిర్వహణ అంశంపై దేవాలయాల ద్వారా సమాజానికి జరగవలసిన సేవలు ,దేవాలయాలలో ఆచరించవలసిన విధులు, విధానాలు, ఆచారాలు వంటి విషయాలను వివరిస్తారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రసంగం కొనసాగుతుందని అర్చకులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొనవలసిందిగా కోరారు.

14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డీఈవో పరీక్ష



మాట్లాడుతున్న మోహన్ కుమార్

మహారాణిపేట: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో జరుగుతుందని, మొత్తం 4,498 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. శుక్రవారం తన చాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ రవి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం



వీకె బన్సాల్, సునీల్ కుమార్‌లను సన్మానిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

విశాఖ లీగల్: దేశంలోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అవసరం అని సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకుడు వీకే బన్సాల్ అన్నారు. విశాఖ జిల్లా న్యాయస్థానంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన న్యాయమూర్తుల ఐదు రోజుల మీడియేషన్ అండ్ కాన్సిలేషన్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విశాఖ న్యాయవాదుల సంఘం సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు వీకే బన్సాల్, సునీల్ కుమార్‌లను జిల్లా కోర్టులోని గ్రంథాలయంలో ఘనంగా సన్మానించింది. అనంతరం బన్సాల్ మాట్లాడుతూ విశాఖ న్యాయమూర్తులు, న్యాయవాదుల సహకారం మరువలేనిదన్నారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో న్యాయస్థానాలపై ఒత్తిడి తగ్గించడానికి ప్రతి న్యాయవాది, న్యాయమూర్తి మీడియేషన్ కాన్సిలేషన్ విధానాన్ని పాటించాలన్నారు. వీటికి సంబంధించి పలు అంశాలను సోదాహరించారు. న్యాయ సేవ ప్రాధికార సంస్థ జాతీయ శిక్షకుడు రఘు పాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసులు ప్రాథమిక స్థాయిలోనే విచారించి పరిష్కారం దిశగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజకీయ కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయ సేవ ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం. భవిత అన్నారు. దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెరిగిపోతున్న కేసులను తగ్గించి తక్షణ, సత్వర తీర్పుల అందించడానికి మధ్యవర్తిత్వ విధానాన్ని పాటించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, కార్యవర్గ సభ్యులు, ప్రముఖ న్యాయవాది గొలగాని అప్పారావు, డి.హేమమాలిని, సీనియర్ న్యాయవాది కె. శైలేష్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్‌చార్జి) కె. రాధారత్నం పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయండి



కేంద్ర ఆర్థిక కార్యదర్శి సోమనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎల్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,110 కోట్ల ఆర్థిక సాయం అందించాలని రాజ్యసభ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి డాక్టర్ టి.వి.సోమనాథన్‌ను కోరారు. శుక్రవారం ఆయన న్యూఢిల్లీలో కార్యదర్శిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ వెలుపల, కంపెనీ నియంత్రణలో లేని ఇతర కారణాల వల్ల ప్లాంట్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి స్టీల్‌ప్లాంట్‌కు రూ. 3,110 కోట్లను ప్రాధాన్యత షేర్ల రూపంలో ఇవ్వాలని కోరారు. 2002లో నాటి ప్రధాని వాజ్‌పేయ్ ప్రభుత్వం అందించిన మద్దతును గుర్తు చేస్తూ.. స్టీల్‌ప్లాంట్ 2011–16 మధ్య కేంద్ర ప్రభుత్వానికి రూ.2,937 కోట్లు తిరిగి చెల్లించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ నికర విలువ పెంచడానికి భూమి యాజమాన్యానికి బదలాయించడం, వివిధ వనరుల ద్వారా అదనంగా రూ.4 వేల కోట్లు సమకూర్చే అవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ కార్యదర్శి సోమనాథన్ సానుకూలంగా స్పందించారని జీవీఎల్ తెలిపారు.

బాలుడ్ని రక్షించిన బీచ్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం



ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న పీపుల్ పవర్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి తీరంలో మునిగిపోతుండగా బాలుడ్ని రక్షించిన ఇద్దరు బీచ్ ఫొటోగ్రాఫర్లను శుక్రవారం అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సత్కరించారు. ఈనెల 15 తేదీన భవాని ప్రసాద్ నీట్లో మునిగిపోతుండగా కొక్కిరి పోతన్న, కాసరపు చిన పైడిరాజు అనే ఇద్దరు ఫొటోగ్రాఫర్లు బాలుడ్ని రక్షించారు. దీనిపై స్పందించిన పీపుల్ పవర్ సభ్యులు భాస్కర్, గోపీనాథ్, అరవింద్, సురేష్, విక్టరీ తేజ తదితరులు ఇద్దరు ఫొటోగ్రాఫర్లను సత్కరించారు.

కేజీహెచ్ డీసీఎస్ ఆర్‌ఎంవో సరెండర్

ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ భాస్కరరావు



డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి



ఇన్‌చార్జి ఆర్‌ఎంవో డాక్టర్ భాస్కరరావు

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డి.లక్ష్మీతులసిని శుక్రవారం సరెండర్ చేశారు. ఈ మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలల క్రితం కేజీహెచ్ డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ లక్ష్మీ తులసీ బాధ్యతలు చేపట్టారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఫోరెన్సిక్ విభాగం వైద్యులు కొంత మంది ఆమెపై రాష్ట్ర వైద్య విద్యా డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ నరసింహానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణ నిర్వహించారు. ఆయన ఆదేశాల మేరకు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ డాక్టర్ లక్ష్మీతులసిని సరెండర్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ భాస్కరరావు

డీసీఎస్ ఆర్‌ఎంవోగా డాక్టర్ ధవళ భాస్కరరావును నియమించారు. ఇప్పటి వరకు ఆయన కేజీహెచ్ ఏఆర్‌ఎంవోగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఇన్‌చార్జి డీసీఎస్ ఆర్‌ఎంవోగా నియమితులయ్యారు. డాక్టర్ భాస్కరరావు గతంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా పని చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు పోస్టుల్లో ఆయన సేవలందించారు.

పోస్టర్లు అతికిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖలో గోడలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, డస్ట్ బిన్లు, ప్రజా ఆస్తులపై పోస్టర్లు అతికించినా, పెయింటింగ్, ఇతర రాతలు రాసినా సంబంధిత సంస్థలు, ఆర్గనైజేషన్‌లపై చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ హెచ్చరించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు, మత సంబంధ సంస్థలు, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి నగర సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోందన్నారు. పలువురు విచ్చలవిడిగా అనధికార హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, డిజిటల్ బ్యానర్లతో నగర అందాన్ని చెడగొడుతున్నారని చెప్పారు. 1997 యాక్ట్ ప్రకారం నగర సుందరీకరణకు ఆటంకం కల్గించే వారిపై చర్యలు తీసుకుంటామని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం రూ.లక్ష వరకు జరిమానా విధించనున్నట్టు చెప్పారు.

• మేఘాలలో తేలిపొమ్మన్నది..

మేఘాలలో తేలిపొమ్మన్నది.. తూఫానులా రేగిపొమ్మన్నది.. అమ్మాయితో సాగుతూ చిలిపి మది.. అంటూ ఓ సినిమా కోసం సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన గేయానికి సరితూగేలా ఓ అమ్మాయి మేఘాలలో తేలియాడింది. తుపాను వేళ తుపానులా రేగిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటే ఆ ప్రకృతి సౌందర్యానికి తన్మయత్వం చెందింది. నీలి మబ్బులను అందుకోవాలన్న తపనతో నింగివైపు ఎగిరి గంతేసింది. ప్రకృతి రమణీయతను తనివి తీరా ఆస్వాదించింది. విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద శుక్రవారం కనిపించిన అరుదైన ఆ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. దానికి మువ్వన్నెల జెండా సాక్షిగా నిలిచింది.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్



బెంగళూరు-భువనేశ్వర్ మధ్య సమ్మర్ స్పెషల్

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా ఆయా మార్గాల్లో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఎస్ఎంవీటీ బెంగళూరు-భువనేశ్వర్(06271) స్పెషల్ ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. భువనేశ్వర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (06272) స్పెషల్ జూన్ 2 ఉదయం 6.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 2.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు బెంగళూరు వెళ్తుంది.
- ఎస్ఎంవీ బెంగళూరు-సంబల్‌పూర్(06279) స్పెషల్ బెంగళూరులో జూన్ 7 అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు ఐదు గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. సంబల్‌పూర్-ఎస్ఎంవీ బెంగళూరు(06280) స్పెషల్ జూన్ 8 ఉదయం 11.35 గంటలకు బయలుదేరి.. అదే రోజు రాత్రి 9.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు బెంగళూరు వెళ్తుంది.

పలు రైళ్ల రీషెడ్యూల్ : పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి ఆలస్యంగా రైళ్లు బయలుదేరాయి. గురువారం ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా (12503) ఎక్స్‌ప్రెస్ సుమారు 27 గంటలు ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరింది. ◆ శుక్రవారం ఉదయం 10.35గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరింది. ◆ వాస్కోడగామా-షాలిమార్ (18048) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది.

ఆన్‌లైన్‌లో ఇంటర్ మూల్యాంకనం!

- సప్లిమెంటరీ పరీక్షలతో ప్రయోగాత్మకంగా అమలు
- సకాలంలో ఫలితాలు ఇచ్చేలా కార్యాచరణ
- అధ్యాపకులకు తొలగనున్న స్పాట్ ఇబ్బందులు
- బోధనకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు
- భారీగా తగ్గనున్న స్పాట్ వాల్యుయేషన్ ఖర్చు
- ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాలకు విశాఖలో స్కానింగ్ సెంటర్


విశాఖ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కానింగ్ సెంటర్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ విధానంలో చేపట్టాలని నిర్ణయించిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)గా నియమితులైన అధ్యాపకుడు జూనియర్ కాలేజీల్లో తన రోజు వారీ విధులు నిర్వహిస్తూనే.. పని చేసే కాలేజీలో లేదా ఇంటి వద్ద జవాబు పత్రాలను మూల్యాంకనం చేయవచ్చు. ఇంటర్మీడియట్ కాలేజీల్లో విద్యా బోధనకు ఆటంకం లేకుండా బోర్డు ఉన్నతాధికారులు ప్రయోగాత్మకంగా 'ఆన్‌లైన్ మూల్యాంకనం'విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని వల్ల స్పాట్ వాల్యుయేషన్ ఖర్చు సైతం తగ్గనుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏటా స్పాట్ నిర్వహణలో సుమారు రెండు వేల మంది అధ్యాపకుల విధుల్లో పాల్గొంటారు. దీని కోసం రూ.3 కోట్లు వ్యయం చేస్తుండగా.. ఆన్‌లైన్ విధానంలో ఇది సగానికి తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూల్యాంకనం ఎలా చేస్తారంటే..

స్కానింగ్ చేసిన జవాబు పత్రాలను అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)గా ఎంపిక చేసిన అధ్యాపకుడికి ఆన్‌లైన్‌లో పంపిస్తారు. ప్రత్యేకంగా కేటాయించే కోడ్ ఆధారంగా కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్‌లో ఓపెన్ చేసి తాను పనిచేసే కాలేజీ లేదా ఇంటివద్ద జవాబు పత్రాలను మూల్యాంకనం చేయవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడైనా జవాబు పత్రాలను దిద్దవచ్చు. **అయితే తప్పనిసరిగా సీసీ కెమెరా పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ అంతా జరగాలి. రోజుకు 60 పేపర్ల వరకు** మూల్యాంకనం చేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఎగ్జామినర్ మూల్యాంకనం సవ్యంగా చేశారా లేదా అనేది చీఫ్ ఎగ్జామినర్(సీఈ) పరిశీలించనున్నారు.

పారదర్శకతకు పెద్ద పీట

ఆన్‌లైన్ విధానంలో జరిగే మూల్యాంకనం ప్రక్రియ ఎంతో పారదర్శకతతో కూడినదని అధికారులు చెబుతున్నారు. 24 పేజీల గల ఓ సబ్జెక్టు జవాబు పత్రాన్ని పూర్తి స్థాయిలో మూల్యాంకనం చేస్తేనే, ఎగ్జామినర్ కంప్యూటర్ లాగిన్ క్లోజ్ చేసే అవకాశం ఉంటుంది. పొరపాటున ఏ ఒక్క పేజీ దిద్దకపోయినా.. కంప్యూటర్‌లో రెడ్ సింబల్‌తో దాన్ని చూపిస్తోంది. అంతేకాకుండా ఎగ్జామినర్ చేసిన మూల్యాంకనంను చీఫ్ ఎగ్జామినర్, అదే విధంగా ఉన్నతాధికారులు సైతం పరిశీలన చేయనున్నారు. పారదర్శకతతో కూడిన మూల్యాంకనంతో పాటు ఫలితాలను సకాలంలో ప్రకటించే అవకాశం ఉంటుంది.

విధులు నిర్వర్తిస్తూనే..

స్పాట్ వాల్యుయేషన్ విధులంటే అధ్యాపకులు నిరాసక్తత వ్యక్తం చేసేవారు. దూరాభార ప్రయాణంతో పాటు మండుటెండలో రోజంతా స్పాట్ సెంటర్‌లో విధులంటే అమ్మో అంటూ విధులను తప్పించుకునేందుకు ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అంతేకాకుండా స్పాట్ విధులతో కాలేజీల్లో బోధనకు సైతం ఆటంకం ఏర్పడేది. ఆన్‌లైన్ విధానంలో అధ్యాపకులు ఎంచక్కా రోజువారీ విధులు నిర్వహిస్తూనే రోజులో ఏదో ఒక సమయంలో కేటాయించిన జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేలా అవకాశం ఉంటుందని ఇంటర్ బోర్డు ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్ఐవో, విశాఖ క్యాంప్ ఇన్‌చార్జి పి.మురళీధర్ తెలిపారు.

ఐదు జిల్లాలకు విశాఖలో కేంద్రం

ఆన్‌లైన్ మూల్యాంకనంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, కర్నూలులో స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి విశాఖ జైల్ రోడ్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అత్యాధునిక టెక్నాలజీ కూడిన 52 కంప్యూటర్ కమ్ స్కానింగ్ పరికరాలను అమర్చారు. ఐదు జిల్లాల నుంచి వచ్చే జవాబు పత్రాలను ఎప్పటికప్పుడు స్కానింగ్ చేసేందుకు 60 మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు.



పాలిటెక్నిక్, గైస్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ(నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు లభించింది. సాంకేతిక కళాశాలకు డిప్లమో స్థాయిలో ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి అని కాలేజీ ప్రిన్సిపాల్ కె.నారాయణ రావు తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు కాలేజీ యాజమాన్యం ఎన్‌బీఏ గుర్తింపునకు అవసరమైన చర్యలు తీసుకుంది. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీ సాధించిన ప్రగతి, క్రీడా సౌకర్యాలు, భవన సముదాయాలు. ప్రయోగశాలలు, సాంకేతిక విధానాల అమలు వంటి అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈ మేరకు కళాశాలలోని మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెటలర్జీ విభాగాలకు 2027 జూన్ 30వ తేదీ వరకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేసింది. ఈ గుర్తింపు సాధించడం కాలేజీ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ సంతోషం వ్యక్తం చేశారు.

- కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ కాలేజీలో నాలుగు బ్రాంచీలు ఉండగా వీటిలో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపునకు దరఖాస్తు చేశారు. ఇటీవల ఎన్‌బీఏ ప్రతినిధులు కాలేజీని సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ మేరకు ఈ రెండు విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు మంజూరు చేశారు. ఈ గుర్తింపు 2027 జూన్ 30 వరకు అమలులో ఉంటుంది. మిగతా విభాగాలకు కూడా త్వరలో ఎన్‌బీఏ గుర్తింపునకు వెళ్తామని ప్రిన్సిపాల్ వెంకటరమణ చెప్పారు. ఇందుకు సహకరించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి, సెక్రటరీ కె.రమణబాబు, జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావుకు రెండు కళాశాలల ప్రిన్సిపాళ్లు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపునకు కృషి చేసిన వివిధ శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

- 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని జిల్లా పాలిసెట్ కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 3వ తేదీ వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామన్నారు. ఇందుకోసం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కంచరపాలెం గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్), పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

ర్యాంకుల వారీగా షెడ్యూల్ ఇదీ..

తేదీ	గైస్, కంచరపాలెం	పాలిటెక్నిక్, కంచరపాలెం	పాలిటెక్నిక్, పెందుర్తి
మే 27	1-6,000	6,001-12,000	1-12,000
28	12,001-19,500	19,501-27,000	12,001-27,000
29	27,001-35,000	35,001-43,000	27,001-43,000
30	43,001-51,000	51,001-59,000	43,001-59,000
31	59,001-67,000	67,001-75,000	59,001-75,000
జూన్ 1	75,001-83,500	83,501-92,000	75,001-92,000
2	92,001-1,00,000	1,00,001-1,08,000	92,001-1,08,000
3	1,08,001-1,16,000	1,16,001-చివరి ర్యాంకు	1,08,001-చివరి ర్యాంకు

షెడ్యూల్‌లో ప్రకటించిన ప్రకారం ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు విద్యార్థులు వారి ర్యాంకుల ప్రకారం హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు సూచనలివీ..

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి వస్తుంది. ఓసీ/బీసీలకు రూ.700, ఎస్సీ/ఎస్టీలకు రూ.250
- ప్రాసెసింగ్ ఫీజు రసీదుతోపాటు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో ఒరిజినల్ లేదా ఇంటర్నెట్ కాపీని కౌన్సెలింగ్‌కు తీసుకురావాలి.
- 4- 10 తరగతుల స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్సియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వారికి 2021 జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువ పత్రం, కులధ్రువీకరణ పత్రం, టీసీ, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంటుంది.
- ఎస్టీ అభ్యర్థులు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలి. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి ఈ నెల 31 నుంచి జూన్ 3వ తేదీలోగా హాజరుకావాల్సి ఉంటుంది.

31 నుంచి ఆప్షన్ల ఎంపిక

ఈ నెల 31 నుంచి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. 31 నుంచి జూన్ 1 వరకు 1-50,000 ర్యాంకులు, జూన్ 2 నుంచి 3 వరకు 50,001 నుంచి 90,000 ర్యాంకులు, జూన్ 4 నుంచి 5 వరకు 90,001 నుంచి చివరి ర్యాంకు వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. జూన్ 5న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఇస్తారు. జూన్ 7న సీట్ల కేటాయింపు ఉంటుందని జిల్లా కన్వీనర్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు https:// appolycet. nic. in ను సందర్శించవచ్చు.


తరగతులకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

కంటెయినర్ ఢీకొని వివాహిత దుర్మరణం

- కుమార్తె కాలేజీ ఫీజు చెల్లించడానికి వచ్చి మృత్యువాత

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా ఎల్.కోటకు చెందిన సావర్ల నవ్య అనే వివాహిత మృతి చెందింది. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దిపాలెం నారాయణ కళాశాలలో నవ్య కుమార్తె ఝాన్సీ చదువుతోంది. కుమార్తె ఫీజు చెల్లించడానికి గానూ కుమారుడు రాజు, కుమార్తెతో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై పెద్దిపాలెం వస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాంచీ వెళుతున్న చాక్లెట్ల కంటెయినర్ గోకార్టింగ్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవ్య అక్కడికక్కడే మృతి చెందగా.. రాజు, ఝాన్సీ గాయపడ్డారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ సునీల్ ఫిర్యాదుతో సీఐ టి.తిరుపతిరావు కేసు నమోదు చేస్తున్నారు.


బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

రేపు గీతం ప్రవేశ పరీక్ష

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) -2024కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాల్లో ఈ నెల 26న ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభ కల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పో ప్రారంభం

దాబాగార్డెన్స్: నగరంలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు నిర్వహించే ఎక్స్‌పోలో పలు డిజైన్ల చీరలు, సల్వార్లు, టాప్స్, లెనిన్‌తో సహా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాల ప్రదర్శనతో పాటు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విభిన్న స్టాళ్లలో అద్దకం, ప్రింటెడ్, ఎంబ్రాయిడరీ, పోచంపల్లి, కలంకారి చీరలు నుంచి సంప్రదాయ కోల్‌కతా, భాగల్పూరి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్, బెనారస్ పట్టు చీరలను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పోచంపల్లి కాటన్, ఉప్పాడ, వెంకటగిరి పట్టుచీరలు, కాంచీపురం నుంచి బంగారు/వెండి జరీ చీరలు, జైపూర్ దుప్పట్లు, సల్వార్ మెటీరియల్, కుర్తీలు, రాజస్థాన్ నుంచి కోటా డోరియా, ఉత్తరప్రదేశ్ నుంచి బెనారస్, జమదాని, జమావార్, చికాన్ వంటివి ఎన్నో ఉత్పత్తులను ప్రదర్శించినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలకు ప్రదర్శన ఉంటుందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.


చీరను ప్రదర్శిస్తున్న మోడల్

చేపల లోడుతో లారీ బోల్తా


లోడుతో విడిపోయిన లారీ భాగం

తగరపువలస: ఆనందపురం మండలం జాతీయ రహదారిపై ఎస్ఎస్ఆర్ఐటీ కళాశాల ఎదురుగా శుక్రవారం వేకువజామున చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో కేబిన్‌తో లారీ పైభాగం విడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలివీ.. తమిళనాడులోని నారాయణపురం నుంచి బిహార్‌కు వెళ్తున్న లారీ వేకువజామున 4.30 ప్రాంతంలో డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ బోల్తా పడి కేబిన్, లోడు విడిపోయి రహదారిపై వేరు వేరుగా పడిపోయాయి. చేపల లోడును తాళ్లు, పరదాలతో కట్టుదిట్టంగా కట్టివేయడంతో ఏ నష్టం జరగలేదు. ఆ సమయంలో ట్రాఫిక్ కూడా ఎక్కువగా లేకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న ఆనందపురం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద వివరాలు సేకరించారు.

